క్లుప్తంగా

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం


భాస్కరావు కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పరవాడ: ఇటీవల గుండె పోటుతో మరణించిన స్థానిక జెడ్పీ హైస్కూల్లో 1998–99 టెన్త్ బ్యాచ్ విద్యార్థి వర్రి భాస్కరరావు కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆసరాగా నిలిచారు. చిన్న వయస్సులోనే భాస్కరరావు అకాలమరణంతో అతని కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. దీంతో అతనితో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు తమకు తోచిన సాయం చేసేందుకు ముందుకొచ్చారు. తలా కొంత నగదు సేకరించి ఆ వచ్చిన మొత్తం రూ.1.20 లక్షలను కుటుంబ సభ్యులకు ఆదివారం అందించారు. మిత్రుడు లేకపోయినా.. అతని కుటుంబానికి అండగా నిలిచి, మానవత్వాన్ని చాటుకున్నారు.

ఆగివున్న లారీని ఢీకొనడంతో ప్రమాదం

క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్


రెండు లారీల మధ్య ఇరుక్కుపోయిన డ్రైవర్ వెంపల రవిచరణ్

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై ఆగివున్న లారీని వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానిక ఎస్‌ఐ సింహాచలం తెలిపిన వివరాలు.. హైవేపై చిన్నయ్యపాలెం వద్ద సర్వీస్ రోడ్డులోని టీ స్టాల్ ముందు ఆదివారం ఉదయం ఓ లారీ డ్రైవర్ తన లారీని నిలిపాడు. పెందుర్తి నుంచి సబ్బవరం వైపు వస్తున్న మరో లారీ ఆగివున్న ఈ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఆ లారీ డ్రైవర్ వెంపల రవిచరణ్(25) రెండు కాళ్లు ఇరుక్కుపోయి, తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో పాటు సబ్బవరం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. 108 సిబ్బంది డాక్టర్ల సూచన మేరకు ఇరుక్కున్న లారీ క్యాబిన్లోనే రవిచరణ్‌కు సెలైన్ బాటిల్ ఎక్కించి, అత్యవసర వైద్య సేవలు అందించారు. రెండున్నర గంటల పాటు శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీసి, చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన డ్రైవర్ మూడు రోజులగా వాహనాన్ని నడుపుతున్న నేపథ్యంలో నిద్రమత్తులో ఈ ఘటన జరిగిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. డ్రైవర్ రవి గాజువాక దరి జగ్గు జంక్షన్‌కు చెందినవాడిగా తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సింహాచలం తెలిపారు.

శ్రీకృష్ణాపురం విద్యార్థుల ప్రతిభ


రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక నిర్వహిస్తున్న నిర్వాహకులు

ఆరిలోవ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో ఆదివారం స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో శ్రీకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. 19 ఏళ్లలోపు కేటగిరీలో హ్యాండ్‌బాల్, సాఫ్ట్ బాల్, బేస్‌బాల్ పోటీలు బాలుర, బాలికల విభాగానికి విశాఖ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలో కళాశాలకు చెందిన అభిలాష్, చిన్నబాబు, రాహుల్, వరప్రసాద్ హ్యాండ్‌బాల్, మనోజ్, అశోక్ సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జట్టుకు హేమంత్ ఎంపికై నట్టు తెలిపారు. వచ్చే నెల కడప, గుంటూరు జిల్లాల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు వీరంతా ఎంపికయ్యారని ప్రిన్సిపల్ రత్నవల్లి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ విద్యాసాగర్, పీఈటీ వివేక్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సిబ్బంది, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థల సమన్వయకర్త గ్రేస్ అభినందించారు.

యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్


కాపాడిన యువకులతో లైఫ్‌గార్డులు, మెరైన్ పోలీసులు

ఏయూ క్యాంపస్: సాగర తీరంలో సముద్ర స్నానం చేయడానికి వచ్చి మునిగిపోతున్న ఇద్దరు యువకులను లైఫ్‌గార్డ్‌లు, మెరైన్ పోలీసులు రక్షించారు. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు విశాఖ పర్యటనకు వచ్చారు. ఆదివారం సాయంత్రం ఆర్‌కే బీచ్ వద్ద స్నానం చేస్తుండగా వారిలో ఇంజమాముల్ హక్, నయామ్‌లు కెరటాల ధాటికి సముద్రంలోకి వెళ్లిపోయారు వెంటనే అక్కడే విధుల్లో ఉన్న మెరైన్ పోలీసులు స్పందించి జీవీఎంసీ లైఫ్ గార్డులను అప్రమత్తం చేశారు. వెంటనే వారు మునిగిపోతున్న ఇద్దరు యువకులను రక్షించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి అక్కడి నుంచి పంపించేశారు,

వెలుగుల పండగ.. ఆనందం మెండుగ


పాపయ్యరాజుపాలెంలో దుకాణాల్లో అమ్మకానికి సిద్ధంగా బాణసంచా

దీపం జ్ఞానానికి ప్రతిరూపం. అలాంటి దీపాల వెలుగులు.. చిచ్చుబుడ్ల మెరుపులు.. మతాబుల హోరుతో ఆనంద దీపావళి వచ్చేసింది. నియోజకవర్గం సందడిగా మారింది. వెలుగుల పండగకు ఊరూ వాడా తేడా లేకుండా పూజాసామగ్రి, బాణసంచా కొనుగోళ్లతో సందడిగా మారాయి. దివ్వెలు కొట్టేందుకు చెరకు గడలు, గోగుపుల్లలు కొనుగోలు చేశారు. మట్టి ప్రమిదలు జోరుగా అమ్ముడయ్యాయి. వివిధ రకాల ఆఫర్లతో బాణాసంచా దుకాణదారులు వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

- దీపావళి పండగకు ముస్తాబైన పెందుర్తి
- ఆదివారం సాయంత్రం వరకు బాణసంచా విక్రయాలకు అనుమతి నిల్
- దుకాణాల అనుమతి, ఇతర వ్యవహారాల్లో బ్రోకర్ల హవా
- పాపయ్యరాజుపాలెంలో రూ.15 లక్షలు వసూలు చేసిన ఇద్దరు వ్యక్తులు
- దుకాణాల అనుమతుల మంజూరులో కూటమి నాయకుల పెత్తనం

పెందుర్తి: దీపావళి శోభ మార్కెట్లను తాకింది. వాతావరణం అనుకూలిస్తే సోమవారం ఉదయం పూర్తిస్థాయిలో మందుగుండు సామగ్రి కొనుగోళ్లు జరగనున్నాయి. అయితే బాణాసంచా ధరలు బాంబుల్లా పేలుతున్నాయి. రూ.7–10 వేలు పెట్టినా సరిపడా మందుగుండు సామాగ్రి రాని పరిస్థితి. మరోవైపు పాపయ్యరాజుపాలెం, పెందుర్తి ప్రాంతాల్లో దుకాణాల అనుమతి విషయంలో బ్రోకర్ల హవా నడిచింది. పాపయ్యరాజుపాలెంలో 20 దుకాణాల అనుమతికి కూటమి ప్రజాప్రతినిధుల అండదండలతో ఇద్దరు వ్యక్తులు ఒక్కో దుకాణం నుంచి రూ.60–70 వేలు చొప్పున రూ.15 లక్షల వరకు వసూలు చేశారు. అయితే ఆదివారం సాయంత్రం వరకు ఆయా దుకాణాలకు అనుమతి రాకపోవడంతో భారీ మొత్తంలో నగదు వసూలు చేసిన ఇద్దరు వ్యక్తులపై వ్యాపారులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

జోరుగా అమ్మకాలు

ఆదివారం ఉదయం నుంచి అమ్మకాలు సాగిద్దామనుకున్న పెందుర్తి ప్రాంత వ్యాపారులకు అనుమతులు రాక సాయంత్రం వరకు చేష్టలుడిగిపోయారు. పెందుర్తి, పాపయ్యరాజుపాలెం, నరవ అప్పన్నపాలెంల్లోని దుకాణాలకు సాయంత్రం 6 గంటల తరువాత అనుమతులు వచ్చాయి. దీంతో ఉన్నంతలో సాయంత్రం వ్యాపారులు జోరుగా వ్యాపారం సాగించారు. అయితే చైనా టపాసులు వీరికి ఇబ్బందికరంగా మారాయి. కొందరు వ్యాపారులు బ్లాక్‌లో చైనా టపాసులను తీసుకురావడంతో తమ వ్యాపారాలు దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ధరలు పెరిగినా ప్రజలు తప్పనిసరి పరిస్థితిలో పిల్లల కోసం బాణసంచా కొనుగోలు చేశారు. వ్యాపారులు ఎంత ఆఫర్లు ఇచ్చినా రూ.వేలల్లో వెచ్చిస్తే తప్ప ఇంటిల్లిపాదికి సరిపడా టపాసులు రావట్లేదని ప్రజలు చెప్పుకొచ్చారు.


పాపయ్యరాజుపాలెంలో బాణసంచా దుకాణాల వద్ద సందడి



దుకాణాల వద్ద కొనుగోళ్ల సందడి


ఫ్యామిలీ ప్యాక్ కొనుగోలు చేస్తున్న వినియోగదారుడు


బాణసంచా దుకాణాలు


అనుమతి లేకపోవడంతో ఆదివారం సాయంత్రం వరకు వెలవెలబోయిన దుకాణాలు

అప్రమత్తంగా ఉండాలి



దీపావళి ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలి. నిబంధనల మేరకే దుకాణాలకు అనుమతిచ్చాం. ప్రతి దుకాణం వద్ద ఖచ్చితంగా నీరు, ఇసుక పెట్టుకోవాలని దుకాణదారులకు సూచించాం. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. దుకాణదారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండి బాణసంచా వినియోగించాలి.

– కె.వి.సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

కూటమి-బ్రోకర్లు-అనుమతులు

ఎన్నడూ లేనట్లు పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో బాణసంచా దుకాణాల అనుమతుల్లో బ్రోకర్ల హవా నడిచింది. ఇద్దరు వ్యక్తులు పాపయ్యరాజు పాలెం వద్ద ఉన్న 20 దుకాణాల నుంచి అనుమతులు ఇప్పించేందుకు గంపగుత్తగా దోచుకున్నారు. దాదాపు రూ.15 లక్షలు వసూలు చేసి పోలీసులు, జీవీఎంసీ, ఇతర విభాగాలను మేం చూసుకుంటామని చెప్పి దండుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. వీరు శనివారం అర్ధరాత్రికే వ్యాపారానికి అనుమతి తెస్తామని చెప్పి డబ్బులు వసూలు చేశారు. అయితే ఆదివారం సాయంత్రం వరకు అనుమతులు రాకపోవడంతో పోలీసులు వ్యాపారాన్ని నిలిపేశారు. దీంతో కొందరు కూటమి నాయకులు ఆయా బ్రోకర్లతో చేతుల కలిపి అనుమతులు తేవడంతో ఎట్టకేలకు వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు.

అనధికార బాణసంచా తయారీపై చర్యలు


బాణసంచా విక్రయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ రామచంద్రరావుతహసీల్దార్ చిన్నికృష్ణ


బాణసంచా దుకాణాలను తనిఖీ చేస్తున్న పరవాడ సీఐ మల్లికార్జునరావు

సబ్బవరం: నిబంధనలు పాటించని బాణసంచా తయారీ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ హెచ్చరించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ కేంద్రాలను సీఐ రామచంద్రరావుతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 17 బాణసంచా విక్రయ స్టాల్స్‌కు అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ అదేశాల మేరకు మండల కేంద్రానికి, లా యూనివర్సిటీ సమీపంలో స్టాల్స్‌కు అనుమతులిచ్చినట్లు తెలిపారు. స్టాల్‌కు స్టాల్‌కు మధ్య కనీసం 3 అడుగుల దూరం పాటించాలని, స్టాల్స్ పైకప్పుగా సిమెంట్ రేకులు వేయాలన్నారు. స్టాల్స్ వద్ద నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవడంతోపాటు విధిగా భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెంలో బాణసంచా తయారీ కేంద్రాలను పరిశీలించి అనుమతుల్లేకుండా బాణసంచా తయారుచేసిన మొగలిపురానికి చెందిన గొర్లి దేముడును అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

బాణసంచా స్టాళ్ల పరిశీలన

పరవాడ: అనధికార దీపావళి సామగ్రి దుకాణాలపై చర్యలు తీసుకుంటామని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు హెచ్చరించారు. మండలంలో పర్మిషన్ పొందిన దీపావళి సామగ్రి దుకాణాలను ఆదివారం ఆయన తనిఖీలు నిర్వహించారు. మండలంలోని లంకెలపాలెం, పరవాడ, వెన్నలపాలెం కూడలి, దేశపాత్రునిపాలెం, గొర్లివానిపాలెం, దీపాంజలినగర్, వాడచీపురుపల్లి ప్రాంతాల్లో లైసెన్స్ పొందిన 22 దుకాణాలను పరిశీలించి, హెచ్చరికలు జారీ చేశారు.. దుకాణాల వద్ద అగ్నిమాపక శాఖ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. రాత్రి సమయంలో కాపలా తప్పనసరిగా ఉంచాలని సూచించారు.

ఎస్‌ఆర్‌పురంలో బెల్ట్ దుకాణంపై దాడి

18 మద్యం సీసాల స్వాధీనం.. నిందితుడి అరెస్ట్


పట్టుబడిన మద్యం, నిందితుడితో పోలీసులు

పెందుర్తి: గ్రామాల్లో మద్యం బెల్ట్ దుకాణాల జోరు కొనసాగుతోంది. మండలంలోని సౌభాగ్య రాయపురం(ఎస్‌ఆర్ పురం)లో అనుమతి లేకుండా మద్యం విక్రయాలు జరుపుతున్న ఓ దుకాణంపై పెందుర్తి పోలీసులు ఆదివారం దాడి చేశారు. 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పల్లా అప్పలనాయుడు తన దుకాణంలో అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్నట్లు పెందుర్తి పోలీసులకు సమాచారం అందింది. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం దుకాణంపై దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడిపై ఎక్సైజ్ చట్ట ప్రకారం కేసు నమోదు చేసి సీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సినీ హీరో ప్రదీప్ రంగనాథన్


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న విజయనగరం డీఆర్వో శ్రీనివాసమూర్తి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సినీ హీరో ప్రదీప్ రంగనాథన్(డ్యూడ్ సినిమా ఫేం) ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు జరిపి, వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందించారు.

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని పలువురు ప్రముఖులు ఆదివారం దర్శించుకున్నారు. యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, విజయనగరం డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో వీరి పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రంలను అధికారులు అందజేశారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో స్వామికి అర్చన చేస్తున్న అర్చకుడు


నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవ విశేషంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తరపూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

తాడి గ్రామ తరలింపు కోరుతూ సిటు నిరసన



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

పరవాడ: కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామ ప్రజలను సురక్షిత ప్రదేశానికి తరలించి ఆదుకోవాలని సిటురాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. తాడి గ్రామంలో ఆదివారం సిటు ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫార్మా పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రజల్ని సురక్షిత ప్రదేశానికి తరలించేందుకు కూటమి ప్రభుత్వం ఎందుకు వెనుకంజ వేస్తోందో తెలియడం లేదన్నారు. గ్రామ తరలింపునకు సర్వేలు పూర్తి అయినా.. తరలింపు విషయాన్ని గాలికి వదిలేశారన్నారు. పరిశ్రమల బారి నుంచి గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించేందుకు శ్రమిస్తానని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పవన్ కల్యాణ్ చేసిన వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామాన్ని తరలించేందుకు చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని కోటేశ్వరరావు హెచ్చరించారు. నిరసనలో సిటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ, ఎస్.వెంకటలక్ష్మి, టి.రేవతి, జి.అప్పారావు, అమ్మాజీ, పి.సత్యవతి, నూకరత్నం, వరహాలమ్మ, భవాని, శివలక్ష్మి పాల్గొన్నారు.

జీవిత బీమాకు ఎంఈఎం నివేదిక మెలిక

అగనంపూడి: బీమా సొమ్ము చెల్లించడానికి ప్రమాదవశాత్తు మరణించినట్టు మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్(ఎంఈఎం) నివేదిక అవసరమని ముడిపెట్టడం, వాటిని అందివ్వాల్సిన పోలీసులు కప్పదాటుగా వ్యవహరిస్తుండడం సరికాదని బాధితురాలు సీతిన లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త ఉక్కు కర్మాగారంలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతిచెందారని, బీమా సంస్థకు మండల మేజిస్ట్రేట్ నివేదికను పోలీసులు ఇవ్వాల్సి ఉండగా.. ఎఫ్ఐఆర్‌నే నివేదకగా ఏసీపీ కార్యాలయం అందించిందన్నారు. దీంతో తాను ఆర్థికంగా నష్టపోతున్నానని, నగర పోలీస్ కమిషనర్ స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

కరెన్సీ నోట్ల అలంకరణలో ధనలక్ష్మి అమ్మవారు



కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో ఆదివారం ధనత్రయోదశిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ముందుగా శ్రీ ధనలక్ష్మి అమ్మవారికి కరెన్సీ నోట్లతో అలంకరణ జరిపి నాణాలు, పసుపు కుంకుమలతో ప్రత్యేకంగా అలంకరించారు. లక్ష్మీ హోమం, సామూహిక పారాయణలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు.

ప్రభుత్వ ఆక్షన్‌లోనే బంజరు భూములు కొనుగోలు చేశాం

- టీడీఆర్‌లో ఎటువంటి అవకతవకలు లేవు
- మీడియాని ఆశ్రయించిన బాధితులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శరత్‌చంద్ర

దాబాగార్డెన్స్: వేపగుంటలో మాస్టర్ ప్లాన్ సదుపాయాల కల్పనకు జీవీఎంసీ సేకరించిన భూములు ప్రభుత్వ, దేవస్థానం భూములు కావని బాధితుల తరఫున గారపాటి శరత్‌చంద్ర స్పష్టం చేశారు. ఈ మేరకు వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ తమ నుంచి కొంత ఆశించారని, అయితే తాము తిరస్కరించడంతో తమ భూములకు సంబంధించి దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. టీడీఆర్ పేర్లతో స్వాహా అంటూ ప్రచురితమైన వార్తల్లో ఏమాత్రం నిజం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆక్షన్‌లోనే బంజరు భూములు తాము కొనుగోలు చేసామన్న విషయాన్ని గుర్తు చేశారు. కోర్టు తీర్పు తమకు అనుకూలంగానే ఉందని తగిన నష్టపరిహారం ఆశిస్తున్నామని తెలిపారు.

టిడ్కో గృహాలు సత్వరం కేటాయించండి

అగనంపూడి: టిడ్కో ఇళ్ల కోసం డబ్బులు చెల్లించి దశాబ్దం కాలం గడుస్తోందని, కాలనీలో సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించి వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ కోరారు. 88వ వార్డు మంగళపాలెం టిడ్కో గృహ సముదాయం వద్ద ఆదివారం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు పదేళ్ల కిందట ఇళ్లు లేని నిరుపేదల నుంచి డబ్బులు డిపాటివ్ మొత్తాన్ని సేకరించారని, అప్పట్లోనే ప్లాట్లు కేటాయిస్తామని నమ్మబలికించారని, నేటికీ కేటాయించకపోవడం వల్ల గృహ సముదాయం శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి వస్తోందన్నారు. కనీస వసతులు సత్వరం కల్పించి లబ్ధిదారులకు అప్పగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిడ్కో గృహ లబ్ధిదారుల సంఘ నాయకులు రొక్కం శ్రీనివాసరావు, ఎ.గోపి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆనంద్ పాల్గొన్నారు.

ఏయూలో ప్రకృతి పంటల సంత విజయవంతం


ప్రకృతి పంటల సంతలో భారత్ కిసాన్ సంఘ్ కేంద్ర కమిటీ సభ్యుడు జలగం కుమారస్వామి, ఇతర సభ్యులు

మద్దిలపాలెం: ఏయూలోని 'ఆ హబ్'ప్రాంగణంలో భారత్ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రకృతి ఆధారిత పంటల సంత విజయవంతమైంది. ఈ సందర్భంగా భారత్ కిసాన్ సంఘ్ కేంద్ర కమిటీ సభ్యుడు జలగం కుమారస్వామి మాట్లాడుతూ ఈ సంతకు విశేష స్పందన లభించిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రకృతి ఆధారిత పంటలనే ఆహారంగా తీసుకోవాలని కోరారు. ఈ ప్రకృతి ఆధారిత పంటల సంత ఇకపై ప్రతి ఆదివారం ఇదే వేదికపై క్రమం తప్పకుండా జరుగుతుందని వెల్లడించారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వారాహి ఎఫ్‌పీవో సహకారంతో ఈ పంటలను నేరుగా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ హబ్ సంస్థ ప్రతినిధి ఈశ్వరపు రవి, గో ఆధారిత ప్రకృతి పంటల రైతు సంఘం ప్రతినిధులు పి.ఎల్.ఎన్.రాజు, దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, పాలెం నేచురల్స్ అశోక్, రిషి, వారాహి సంస్థ ప్రతినిధి గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగికి సన్మానం


కళావతిని సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: అగనంపూడి ఆస్పత్రిలోని ఐసీటీసీ ల్యాబ్‌లో పనిచేసి కేజీహెచ్‌కు బదిలీపై వెళ్లిన కరణం కళావతిని 79వ వార్డు అగనంపూడిలోని అన్నపూర్ణానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కాలనీలోని పూర్ణ గణపతి ఆలయంలో ఆదివారం ఆమెకు సత్కారం చేశారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు దానబాల చిన సన్యాసిరావు, ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి దేముడు మాట్లాడుతూ రెండు దశాబ్దాల పాటు సుదీర్ఘ సేవలు అందించి స్థానికులకు సుపరిచితురాలుగా మారిన కళావతి సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి అన్నయ్య, ఉక్కు కార్మిక సంఘం నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, లయన్స్ క్లబ్ విశాఖ జిల్లా చైర్‌పర్సన్ కిడిమి హనుమంతురావు పాల్గొన్నారు.